## ఆరు గ్యారంటీలపై సమీక్ష సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్, డిసెంబర్ 27: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వేణుమాదవ్‌రావు, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ కమిషనర్ సుధాంశ్ పాల్గొన్నారు.

## కరోనాపై అవగాహన కల్పించండి



వైద్యులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్, డిసెంబర్ 27: కరోనా కేసుల పెరుగుదల నేపథ్యంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కుట్టి వెల్లోడీ దవాఖాన ను ఆకస్మిక తనిఖీ చేశారు. కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వచ్చే రోగులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. జ్వరంతో వచ్చిన వారికి కరోనా పరీక్షలు నిర్వహించాలని, ప్రజల్లో దాని పై అవగాహన కల్పించాలని కోరారు.

## ఘనంగా అయ్యప్ప పడి పూజ



పడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మారావు కుటుంబసభ్యులు

సికింద్రాబాద్, డిసెంబర్ 27: సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ నివాసం సమీపంలో ఆయన కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణతో రూపుదిద్దుకున్న మహాపడి వద్ద భజనలు, ఆధ్యాత్మిక సంకీర్తనలు, భక్తులను ఆకట్టుకున్నాయి.

## ప్రజాపాలన కార్యక్రమానికి ఏర్పాట్లు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 27: బౌద్ధనగర్ డివిజన్‌లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కార్పొరేటర్ కంది శైలజ తెలిపారు. డివిజన్‌లోని బౌద్ధనగర్ కమ్యూనిటీ హాల్, అశోక్ నగర్ సేవా సంఘం, అశోక్‌నగర్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్, అంబర్‌నగర్ బాల్‌వాడీ స్కూల్‌లలో కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు వివరించారు. దరఖాస్తులను పూర్తిగా నింపి, సంబంధిత డాక్యుమెంట్లను జతచేర్చి సమీప కేంద్రంలో దాఖలు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభం



వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 27: కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ చేరువ చేసేందుకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ఎంతగానో దోహదపడుతుందని గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. సోదరీమణులు కష్టపడకుండా ఉండాలని పీఎం ఉజ్వల యోజన ద్వారా వంట గ్యాస్ అందిస్తున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా నిరుపేదలకు ఉచితంగా వైద్యసదుపాయం కల్పించనున్నట్లు వివరించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర తెలంగాణలోని వివిధ జిల్లాలు, నగరాలు, పట్టణాల్లో బుధవారం ప్రారంభమైంది. కేంద్రప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందించే వీడియో వ్యాన్‌ను తార్నాక డివిజన్‌లోని లాలాపేట మున్సిపల్ గ్రౌండ్స్‌లో ఆమె లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులతో వర్చువల్‌గా మాట్లాడారు. లబ్ధిదారులు అందుకుంటున్న అభివృద్ధి ఫలాలపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు ఇప్పటి వరకు అందని వారికి ఈ యాత్ర ద్వారా అందుతాయని అభిప్రాయపడ్డారు. సంక్షేమ పథకాలు చివరి లబ్ధిదారుడికి చేరే వరకు తమ ప్రయత్నాలు ఉంటాయన్నారు. గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వివిధ కేంద్ర ప్రభుత్వ స్టాళ్లను గవర్నర్ సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ఫలాలను ప్రజలకు చేరవేయడంతో పాటు, వాటి పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ఈ యాత్ర ఉపయోగపడుతుందన్నారు. పీఎం ఆవాస్ యోజన, అటల్ పెన్షన్ యోజన, ఎంజీఎన్ఆర్ఈజీఏ, వడ్డీ లేని రుణాలు, వ్యవసాయ సంబంధిత పథకాలపై ఈ ఆడియో విజువల్ వ్యాన్లు ప్రజలకు అవగాహన కల్పిస్తామని వివరించారు.

## గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

మారేడ్‌పల్లి, డిసెంబర్ 27: సాంఘిక, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకులాల విద్యా సంస్థల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మహీంద్రాహిల్స్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వినోల ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు అభివృద్ధి చెందిన ఇతర వర్గాల పిల్లలతో సమానంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాలల్లో 11 ఫిబ్రవరి 2024 ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్ని జిల్లాల్లో ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జనవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు రుసుము 100 రూపాయాలతో చెల్లించి అప్లై చేసుకోవాలని సూచించారు. ఈ దరఖాస్తుపై ఫోన్ నంబర్‌ను జత పరచాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

గోల్నాక, డిసెంబర్ 27: బాగ్ అంబర్‌పేట డివిజన్ వడ్డెరబస్తీకి చెందిన షేక్ షమీర్ గొంతు సంబంధిత వ్యాధితో బాధ పడుతూ శస్త్ర చికిత్స చేయికున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సిఫారసుతో సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ.50వేల చెక్కును బుధవారం బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు.

# ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్

అడ్డగుట్ట, డిసెంబర్ 27 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం తుకారాంగేట్‌లోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. అందుకోసం అభయ హస్తం పేరుతో ప్రజా పాలనను అందించేందుకు కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ఈ గ్యారంటీలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు డివిజన్‌లలో డివిజన్‌కు 4 సెంటర్లను ఏర్పాటు చేశారని, సెంటర్‌కు ఒక అధికారిని నియమించినట్లు చెప్పారు. అర్హులైన ప్రజలందరూ దగ్గర్లోని సెంటర్‌కు వెళ్లి గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**లాల్‌బజార్ కార్యాలయంలో...**

బొల్లారం,డిసెంబర్ 27: అర్హులైన ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు ఏడో వార్డు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వినీత జయశీలన్ కోరారు. బుధవారం లాల్‌బజార్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆమె మాట్లాడుతూ..కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెన్నెల గద్దర్ ఆదేశాల మేరకు వార్డు పరిధిలోని ప్రతి బస్తీవాసులకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు కృషి చేస్తామన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

బొల్లారం,డిసెంబర్ 27: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, న్యూ బోయిన్‌పల్లిలోని ప్రతి బస్తీ, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని మిగతా వారికి స్ఫూర్తి గా నిలువాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ సూచించారు. బుధవారం బోయిన్‌పల్లిలోని చిన్న తోకట్ట నక్కల బస్తీలో ఏర్పాటు చేసిన ఐదు సీసీ కెమెరాలను స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల సంఖ్య తగ్గుతుందన్నారు. బస్తీలో తన వంతుగా ఆర్థిక సహాయం అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రాంతి, అరుణ్ యాదవ్, ముకేశ్, సీతారాం బస్తీవాసులు పాల్గొన్నారు.

## రూ.40 లక్షలతో కమ్యూనిటీహాల్



నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లో రూ.40 లక్షల వ్యయంతో పునర్నిర్మించనున్న కమ్యూనిటీహాల్ పనులకు డివిజన్ కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి నిధుల నుంచి దీన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్‌తో పాటు బస్తీ ప్రజలు పాల్గొన్నారు. –అంబర్‌పేట, డిసెంబర్ 27:

# అంజయ్య సేవలు మరువలేనివి

కవాడిగూడ, డిసెంబర్ 27: రజకుల అభివృద్ధికి డాక్టర్ అంజయ్య చేసిన సేవలు మరువలేనివని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఈ మేరకు బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయ ఎదుట రజక ధోబీ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత డాక్టర్ ఎం. అంజయ్య సాయి ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని తెలంగాణ రజక ధోబీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే. లక్ష్మణ్, కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ గోడ్చల రచనశ్రీ, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జయసింహలు హాజరై అంజయ్య సాయి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ రజకుల అభివృద్ధికి అంజయ్యా సాయి శక్తివంచన లేకుండా కృషి చేశారని అన్నారు. ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక (ధోబీ) అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ బొమ్మరాజు కృష్ణమూర్తి, రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మందలపు గాంధీ, రాష్ట్ర సీనియర్ వైస్ చైర్మన్ మావురపు నరసింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, రాష్ట్ర వైస్ చైర్మన్ కొండ వీటి హరినాథ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఖమ్మన్న, రాష్ట్ర కార్యదర్శి చుక్కన్న తదితరులు పాల్గొన్నారు.